సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



సేవా సైన్యానికి సత్కారం

వలంటీర్ల వందనం కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. గురువారం నుంచి 10 రోజుల పాటు వలంటీర్లను సత్కరించనున్నారు. - 8లో



'ఇన్‌స్పైర్' చేసేందుకు సిద్ధం

ఇన్‌స్పైర్ మనాక్ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు రంగం సిద్ధమైంది. టెక్కలి ఐతమ్ కళాశాల వేదికగా కార్యక్రమం జరగనుంది. - 8లో

ఏఆర్ డీఎస్పీగా శేషాద్రినాయుడు



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఆర్మ్‌డు రిజర్వ్ పోలీస్ డీఎస్పీగా ఎల్.శేషాద్రి నాయుడు బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

న్యూస్‌రీల్

18న క్రికెట్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-14, అండర్-16 బాలుర క్రికెట్ జట్ల ఎంపికలను ఈ నెల 18న నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పీవై శాస్త్రి, హసన్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఉదయం 8 నుంచి ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. పూర్తి వివరాలకు సుదర్శన్(9441115396), కిరణ్(8688146164)లను సంప్రదించాలన్నారు.

టీవీ చూడం..ఫోన్ వాడం

- విద్యాదీక్ష బూనిన డీజీపురం విద్యార్థులు



దీక్షా కంకణాలు ధరిస్తున్న విద్యార్థులు

సంతబొమ్మాళి: మండలంలోని డీజీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు బుధవారం వసంత పంచమి సందర్భంగా విద్యాదీక్ష స్వీకరించారు. హెచ్‌ఎం కోత చైతన్య ఆధ్వర్యంలో 81 మంది విద్యార్థులు సరస్వతి ప్రార్థన చేసి ఒకరికొకరు దీక్షా కంకణాలు కట్టుకున్నారు. పబ్లిక్ పరీక్షలు ముగిసే వరకు టీవీలు, మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంటామని, ఆటపాటలు, విందు వినోదాలకు దూరంగా ఉంటామని, చదువు పైనే దృష్టి పెడతామని, చివరి పరీక్ష వరకు కంకణం ధరించి సరస్వతిమాతకు సమర్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరులకు వందనం



గొర్లెపాడులో విద్యార్థుల విన్యాసం

కవిటి: మండలంలోని గొర్లెపాడు ప్రాథమికోన్నత పాఠశాల, పెద్ద ఎర్రగోవిందపుట్టుగ పాఠశాలల్లో బుధవారం బ్లాక్ డే నిర్వహించారు. జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో 2019లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మృతులైన 40 మంది వీరజవాన్ల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ మౌనం పాటించి నివాళులు అర్పించారు. పుల్వామా ఘటన జరిగి ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో బాలబాలికలు పిరమిడ్ ప్రదర్శన చేసి అంజలి ఘటించారు.

శతాధిక వృద్ధుడు మృతి



కోటబొమ్మాళి: మండలంలోని కురుడు పంచాయతీ యరకయ్యపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు పిట్ట రామయ్య బుధవారం వయోభారంతో మృతిచెందారు. రామయ్యకు 112 ఏళ్ల వయసు ఉంటుందని గ్రామస్తులు జలుమూరు శ్రీరాములు, ఇప్పిలి మల్లేసు, ముద్ద మల్లేసు తెలిపారు. రామయ్య మృతి పట్ల వైఎస్సార్ సీపీ నేత గురునాధ యాదవ్ సంతాపం తెలియజేసి నివాళులర్పించారు.

అరటిగెలల మొక్కు



ఆలయ ప్రాంగణంలో వేలాడదీసిన అరటి గెలలు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు బుధవారం 1200 అరటి గెలలు వేలాడిదీసి మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజులుగా జరుగుతున్న కల్యాణ మహోత్సవాలలో భాగంగా ప్రాంగణమంతా అరటి గెలలుతో నిండిపోయింది. శుక్రవారం ఉత్సవాల ముగింపు ఉంటుందని, భక్తులకు తిరిగి గెలలు అప్పగిస్తామని అర్చకులు కొరపాక సిద్దయ్య స్వామి తెలిపారు.

గ్రిగ్స్‌మీట్ ఫైనల్స్ షెడ్యూల్ ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా గ్రిగ్స్‌మీట్ బాలురు, బాలికల ఫైనల్స్ మీట్ పోటీల షెడ్యూల్‌ను డీఈవో కె.వెంకటేశ్వరరావు, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా ఈ నెల 16న బాలురు, 17న బాలికల పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జోనల్‌స్థాయి పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లు/క్రీడాకారులు అర్హులని స్పష్టంచేశారు. జిల్లా విద్యాశాఖ సౌజన్యంతో జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో టీపీఎంహెచ్‌స్కూల్ ఈ పోటీలను నిర్వహిస్తోందని చెప్పారు. పూర్తి వివరాలకు సాంబమూర్తి (8500271575), మాధవరావు (9441570361)లను సంప్రదించాలన్నారు.

రథసప్తమికి రారండోయ్..





- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆదిత్య క్షేత్రం
- నేటి అర్ధరాత్రి నుంచే భానుడికి క్షీరాభిషేక సేవ
- తొమ్మిది గంటల పాటు అరుదైన నిజరూప దర్శనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

ఆహ్వానిస్తున్న అరసవల్లి

అపురూప దివ్యధామంగా విరాజిల్లుతోన్న ఆదిత్య క్షేత్రం అరసవల్లి రథసప్తమి వేడుకకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నేటి అర్ధరాత్రి క్షీరధారలతో స్నానమాడేందుకు బాల భానుడు సిద్ధమయ్యాడు. అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కర్మసాక్షి మూర్తిని దర్శించి తరించేందుకు భక్తజనం ఉత్సాహంగా ఎదురుచూస్తోంది. ఎటు చూసినా ఉత్సవ సంరంభమే... ఏ వైపు వెళ్లినా ఆధ్యాత్మిక సౌరభమే..

అరసవల్లి

మాఘ శుద్ధ సప్తమి రథసప్తమి ఉత్సవానికి ప్రసిద్ధ పుణ్య క్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం సిద్ధమైంది. గురువారం అర్ధరాత్రి 12.30 నుంచి సూర్యజయంతి వేడుకలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం



ఉదయం 7 గంటల వరకు ఆదిత్యుని మూలవిరాట్టుకు క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. రాత్రి 11 గంటల వరకు ఉత్సవం జరగనుంది. ఈ అద్భుత దర్శనం కోసం స్థానికులతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. సాధారణ భక్తులతో పాటు వీఐపీల దర్శన ఏర్పాట్ల కోసం దేవదాయ శాఖ, పోలీసు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు వైదిక కార్యక్రమాల నిర్వహణకు సిద్ధమయ్యారు. ఆలయ ఈవో రమేష్ బాబు దేవదాయ శాఖకు చెందిన ఇతర జిల్లాల నుంచి అధికారులను అదనంగా రప్పించి ప్రత్యేక విధులు కేటాయించారు. ఆలయ మండపం, రాజగోపురాన్ని రంగులు, విద్యుత్ అలంకరణలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

దర్శన మార్గాలివే..



ఆలయ ఆవరణలో టెంట్లు

ఉచిత దర్శనం: అరసవల్లి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల వద్ద ప్రత్యేక క్యూ ద్వారా ప్రవేశించి ఇంద్రపుష్కరిణి ఆగ్నేయ ద్వారం నుంచి కంపార్ట్‌మెంట్ల ద్వారా ఆలయంలోకి రావాల్సి ఉంటుంది.

- గురువారం అర్ధరాత్రి **12.30** గంటల నుంచి క్యూలో అనుమతిస్తారు.

రూ.100 (ప్రత్యేక దర్శనం): ఇది కూడా నగర కార్పొరేషన్ స్కూల్ దగ్గర నుంచే క్యూ ప్రారంభమవుతుంది. క్యూలోనే టిక్కెట్టు కొనుగోలు చేసి పుష్కరిణి ఈశాన్య మార్గం నుంచి గోశాల పక్క నుంచి ఆలయంలోకి రావాల్సి ఉంటుంది. మరో మార్గం ద్వారా వస్తున్న సాధారణ దర్శన లైన్‌కు ఈ లైన్ అనుసంధానం కానుంది.

- గురువారం అర్ధరాత్రి **12.30** గంటల నుంచి ఈ క్యూలో అనుమతిస్తారు.

క్షీరాభిషేక దర్శనం (రూ.500): అరసవల్లి ప్రధాన రహదారిలో బొంపాడ వీధి జంక్షన్ నుంచి సింహద్వారం మీదుగా ఆలయ ప్రధాన ద్వారం నుంచి స్వామి దర్శనానికి వెళ్లాలి. క్యూలోనే టికెట్ కొనుగోలు చేయాలి. ఒక టికెట్‌తో ఇద్దరికి అనుమతిస్తారు.

- అర్ధరాత్రి **12.30** నుంచి ఉదయం **7** గంటల వరకు ఈ టిక్కెట్‌కు అనుమతి
- **రూ.500 (విశిష్ట దర్శనం):** క్షీరాభిషేకం టికెట్‌ను క్యూలోనే విక్రయిస్తారు. ఉదయం **7** నుంచి మాత్రమే టికెట్ల విక్రయాలు మొదలు కానున్నాయి. టికెట్‌కు ఇద్దరిని అనుమతించనున్నారు.

డోనర్ పాసులు (దాతలు): అరసవల్లి ప్రధాన రోడ్డులో బొంపాడ వీధి జంక్షన్ నుంచి సింహద్వారం మీదుగా ప్రత్యేక క్యూలైన్ ద్వారా ఆలయ ఉత్తర ద్వారం నుంచి దర్శనాలకు వెళ్లనున్నారు. వీరికి ఈసారి ప్రత్యేకంగా టైం స్లాట్ అమలు చేస్తుండగా అర్ధరాత్రి 12.30 నుంచి ఉదయం 7 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నారు. తర్వాత కూడా అనుమతిస్తారు. అయితే వీఐపీ టికెట్‌దారులతో కలిసి వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటివరకు సుమారు 1100 మందికి పైగా దాతలు నమోదయ్యారు.

- ఒక్క పాసు ద్వారా నలుగురికి అనుమతి

వీఐపీదర్శన టికెట్ (రూ..500): డోనర్ (దాతలు) పాసుల స్లాట్ టైం ముగియగానే అంటే ఉదయం 7 నుంచి వీఐపీ దర్శన టికెట్‌దారులకు (ఒక్కో టిక్కెట్‌కు ఇద్దరికి అనుమతి) ఇదే క్యూలైన్లలో దర్శనాలకు అనుమతిస్తారు. ఈ పాసులను అరసవల్లి యూనియన్ బ్యాంకులో 3000 విక్రయించారు. శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు 750 మందికి, 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తర్వాత 750 మందికి, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు మరో 750 మందికి, రాత్రి 7 నుంచి రాత్రి 11 గంటల వరకు చివరి 750 మంది పాసుదారులకు అనుమతించనున్నారు.

- ఇక వీవీఐపీలకు ప్రత్యేక వాహనాల ద్వారా సింహద్వారం నుంచి అనుమతించి తిరిగి ఇదే మార్గంలో వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.

కేశఖండన శాల టికెట్ (రూ.50): తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు అరసవల్లి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా కేశఖండన శాల ఏర్పాటు చేశారు.

కనరో భాగ్యము..



- ఏడు గుర్రాలు..ముగ్గురు భార్యలతో అరసవల్లి క్షేత్రంలో శ్రీవారు కొలువుదీరారు.
- శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవి అనే ముగ్గురు భార్యలతో సూర్యభగవానుడు శాలిగ్రామ ఏక శిలతో విగ్రహరూపుడై ఉంటారు.
- స్వామి సింహలగ్న జాతకుడైనందున ఆయన విరాట్టుపై సింహతలాటం ఉంటుంది.
- ఆయనకు రెండు హస్తాలుంటాయి.
- వాటితో రెండు తామర పద్మాలను పట్టుకుని ఉంటారు.
- స్వామివారికి సనక, సనందులు అనే ఇద్దరు సేవకులు నిత్యం.. ఛత్ర, ఛామరలతో స్వామికి సేవ చేస్తుంటారు.
- స్వామివారి నడుముకు చురిక (చిన్న కత్తి) ఉంటుంది. తిరుమల వేంకటేశ్వర స్వామికి కూడా ఇలానే చురిక ఉంటుంది.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..



డీఎస్పీ శృతి

శ్రీకాకుళం క్రైమ్ : రథసప్తమి సందర్భంగా అరసవిల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం గురు,శుక్రవారాల్లో ట్రాఫిక్ ఆంక్షలున్నట్టు డీఎస్పీ యర్రగుంట శృతి పేర్కొన్నారు.

- **రూట్-1** : పెద్దపాడు నుంచి రామలక్ష్మణ జంక్షన్ మీదుగా నగరంలోకి వచ్చే వాహనదారులు సూర్యమహల్ -చినబరాటం - పాతబస్టాండ్ కూడలి -జిల్లాపరిషత్ కార్యాలయం- సంతోషిమాత గుడి - వాంబే కాలనీ మీదుగా 80 ఫీట్ రోడ్డు పార్కింగ్ స్థలానికి చేరుకోవాలి.
- **రూట్-2** : నవభారత్, బాలభారతి మీదుగా నగరంలోకి వచ్చేవారు గుజరాతీపేట కూడలి - ఏడురోడ్ల కూడలి - పందుంపుళ్ల సెంటర్- పాతబస్టాండ్ కూడలి - జిల్లాపరిషత్ కార్యాలయం - సంతోషిమాత గుడి - వాంబే కాలనీ మీదుగా 80 ఫీట్ రోడ్డు పార్కింగ్ స్థలానికి చేరుకోవాలి.
- **రూట్-3** : కొత్తరోడ్డు, బలగ కూడలి మీదుగా నగరంలోకి వచ్చేవారు ఆర్టీసీ కాంప్లెక్సు - డే అండ్ నైట్ కూడలి - ఏడురోడ్ల కూడలి - పందుంపుళ్ల సెంటర్ - పాతబస్టాండు కూడలి - జిల్లాపరిషత్ కార్యాలయం - సంతోషిమాత గుడి - వాంబేకాలనీ మీదుగా 80 ఫీట్ రోడ్డు పార్కింగ్ స్థలానికి చేరుకోవాలి.
- **రూట్ నెం-4** : గార, శ్రీకూర్మం మీదుగా వచ్చేవారు వాడాడ కూడలి వద్ద వాహనాలు పార్కింగ్ చేసి దర్శనానికి వెళ్లవచ్చు. అరసవిల్లి గ్రామానికి వాహనాలు అనుమతించరు.
- **ప్రత్యామ్నాయ రూట్** : ఎన్‌హెచ్-16లో మునసబుపేట సరీస్సు రోడ్డులో ప్రవేశించి చిట్టివానిపేట కూడలి వద్ద ఎడమవైపునకు తిరిగి శాస్త్రులపేట - సానివాడ మీదుగా వొప్పంగి గ్రామానికి చేరుకుని వాడాడ కూడలి వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- **బయటకు వెళ్లే మార్గం** : దర్శనానంతరం భక్తులు 80 ఫీట్ రోడ్డు పార్కింగ్ నుంచి అరసవిల్లి మిల్లు కూడలి - ఉమెన్స్ కాలేజి - సూర్యమహల్ కూడలి - రామలక్ష్మణ కూడలి మీదుగా పెద్దపాడు వైపు నుంచి వెళ్లాలి. ఈ ఆంక్షలు గురువారం ఉదయం 8 నుంచి శుక్రవారం రాత్రి 12 గంటల వరకు అమలవుతాయని డీఎస్పీ పేర్కొన్నారు.

దివ్యాంగులకు, వృద్ధులకు ప్రత్యేక వాహనాల ద్వారా సింహద్వారం వరకు రవాణా సౌకర్యం కల్పించనున్నారు.

కట్టుదిట్టంగా ఏర్పాట్లు..



క్యూలైన్ ఏర్పాట్లలో గతేడాది కంటే మరింత కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు. పోలీసు అధికారుల సూచనలను పరిగణనలోకి తీసుకుని, భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను ఆలయ ఈవో రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్‌లు సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నారు. వప్పంగి మార్గం నుంచి వచ్చిన భక్తుల వాహనాలకు, అలాగే మిల్లు కూడలి నుంచి వచ్చిన వారికి ప్రత్యేకంగా వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

నాడు హర్షవల్లి.. నేడు అరసవల్లి



ప్రత్యక్ష దైవం శ్రీసూర్యనారాయణ స్వామి వారు కొలువైన ఏకైక సూర్యక్షేత్రంగా, దేశంలోనే నిత్య పూజలందుకుంటున్న ఏకైక సూర్యదేవాలయంగా అరసవల్లి విరాజిల్లుతోంది. శతాబ్దాల క్రితం నుంచి ఆరోగ్యం కోసం ఇక్కడ విగ్రహానికి పూజలు చేసేవా రు. తలనీలాలను సమర్పించి, ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసి సూర్యనమస్కారాలు చేసేవారు. ఇలా చేయడంతో తమ కోర్కెలు ఫలించడంతో పాటు పూర్తి ఆరోగ్యవంతులుగా తమ ప్రాంతాలకు సంపూర్ణ హర్షంతో తిరిగి వెళ్లేవారు. అందువల్ల ఈ క్షేత్రానికి హర్షవల్లి అని పిలిచేవారని ప్రతీతి. అయితే కాలక్రమేణా ఇది అరసవల్లిగా మారింది.

సాధారణ భక్తులకే ప్రాధాన్యం: కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ జిలాని, ఎస్పీ రాధిక

రథసప్తమి వేడుకల్లో సాధారణ భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అధికారులను ఆదేశించారు. బుధవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి ఏర్పాట్లను ఎస్పీ జి.ఆర్.రాధికతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తొలిసారి ఆలయానికి విచ్చేసిన కలెక్టర్‌కు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో రమేష్‌బాబులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం కలెక్టర్, ఇతర అధికారుల బృందంతో కలిసి క్యూలైన్లను పరిశీలించారు. రూట్‌మ్యాప్‌ను పరిశీలించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీస్ బందోబస్తు, కంట్రోల్‌రూం, నిఘా చర్యలను ఎస్పీరాధిక కలెక్టర్‌కు వివరించారు. 80 ఫీట్ రోడ్డులో వాహనాల పార్కింగ్ ఏరియాను కూడా కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగయ్య, జిల్లా దేవదాయ శాఖాధి కారి బి.ఆర్.డి.వి.వి. ప్రసాద్‌పట్నాయక్, పర్యవేక్షక సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, డీఎస్పీ శృతి, సీఐ సన్యాసినాయుడు, ఎస్సై బలివాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం..సప్తమి దర్శనం



పద్మ పురాణం ప్రకారం రథసప్తమి నాడు క్షీరాభిషేక, నిజరూపంలో ఉన్న ఆదిత్యున్ని దర్శించుకున్న వారికి పునర్జన్మ ఉండదనేది ఒక విశ్వాసం. శోభకృత్ నామ సంవత్సర సప్తమి అర్ధరాత్రి 12.30 గంటల నుంచి వేకువజాము 7 గంటల వరకు నాడు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేయనున్నాం. సాయంత్రం 4 గంటల వరకు స్వామి వారి నిజరూప దర్శనం ఉంటుంది. అనంతరం పుష్పాలంకరణ సేవ, సాయంత్రం 6 గంటలకు నీరాజనం, విశేషార్చన, తర్వాత ఏకాంత సేవ, పవళింపు సేవతో ఉత్సవం ముగుస్తుంది. గతేడాది కంటే అభిషేకానికి స్పందన పెరిగింది. లక్షకు మించి భక్తులు వచ్చే అవకాశముందని భావిస్తున్నాం.

– ఇప్పిలి శంకరశర్మ, ప్రధానార్చకులు

లక్ష లడ్డూలు.. 50 వేల పులిహోరా ప్యాకెట్లు



భక్తులకు స్వామి వారి ప్రసాదంగా లడ్డూ, పులిహోర ప్రసాదాలు సిద్ధం చేస్తున్నారు. లక్ష లడ్డూలు, 50 వేల పులిహోర ప్యాకెట్లు తయారు చేస్తున్నారు. ఒక్కో లడ్డూ రూ.15, పులిహోర రూ.10కి విక్రయించనున్నారు. సుమారు 10 వేలమందికి అన్నదానం చేయనున్నారు. ఇక దర్శనానంతరం అరసవల్లి గ్రామస్తులు 30 వేల మందికి, పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఉచితంగా అన్నదానం, ప్రసాదాలు, మంచినీరు, మజ్జిగ ఇతరత్రా పంపిణీ చేయనున్నారు.

దివ్యాభరణ భూషితుడు



వెలుగుల రేడు ప్రత్యేక పర్వదినాల్లో స్వర్ణకాంతుల్లో దర్శనమిస్తుంటారు. కేజీల బంగారంతో మకరతోరణాన్ని స్వామి వారికి భక్తులు సమకూర్చారు. స్వామి వారికి ఎంతో విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయి.

- ఆదిత్యాలయం తరఫున చిన్నారులకు పాలు, బిస్కెట్లు పంపిణీ
- 28 పాయింట్లలో తాగునీరు, 12 చోట్ల మరుగుదొడ్ల సౌకర్యం
- వైద్యారోగ్య శాఖ తరఫున నాలుగు చోట్ల వైద్యశిబిరాలు
- కిమ్స్, జెమ్స్, మెడికవర్, కెఎంసి తదితర ఆసుపత్రుల ఆధ్వర్యంలో 10 ప్రైవేటు వైద్య శిబిరాలు
- అందుబాటులో ఐదు అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనం

సరస్వతీ నమస్తుభ్యం



జ్ఞాన సరస్వతీ దేవి

వసంతి పంచమి సందర్భంగా విద్యాలయాలు, దేవాలయాలు చిన్నారులతో కళకళలాడాయి. సామూహిక అక్షరాభ్యాసాలతో సందడిగా మారాయి. సరస్వతీదేవి పుట్టిన రోజు కావడంతో తల్లిదండ్రులంతా తమ పిల్లలతో అక్షరాలు దిద్దించి మురిసిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



చిన్నారితో అక్షరాలు దిద్దిస్తూ..



శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని సరస్వతీదేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు

సేవా సైన్యానికి సత్కారం

- జిల్లాలో నేటి నుంచి 10 రోజుల పాటు 'వలంటీర్లకు వందనం'
- 11912 మందికి అవార్డులు.. 211 మందికి పతకాలు
- 12123 మందికి రూ.18.56 కోట్ల ప్రోత్సాహకం



అరసవల్లి: సేవా దృక్పథానికి చిరునామాగా క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రభుత్వ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న గ్రామ/వార్డు వలంటీర్ల సేవల సత్కారానికి వేళయ్యింది. ఏటా ప్రతిభా ప్రోత్సాహకాలను అందించి సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్రల పేరిట సత్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి విదితమే. ఈ ఏడాదికి సంబంధించి గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు నగదు ప్రోత్సాహకాలను, అత్యుత్తమ సేవలకు మెడల్స్ అందించనున్నారు. జిల్లా కేంద్రంలోనూ వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, సచివాలయాల విభాగ నోడల్ ఆఫీసర్ వాసుదేవ రావు సమక్షంలో కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలో 12123 మందికి అవార్డులు, మెడల్స్ దక్కనున్నాయి. జిల్లాకు చెందిన ఉన్నత ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సమక్షంలో వలంటీర్లకు ఉన్నత గౌరవాన్ని అందించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. గురువారం నుంచి రానున్న పది రోజుల పాటు పండుగ వాతావరణంలో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల వారీగా, గ్రామ/వార్డు సచివాలయాల్లోనూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

పెరిగిన ప్రోత్సాహకం..

జిల్లాలో మూడు కేటగిరిల్లో ఉత్తమ సేవలకు ప్రతిభా అవార్డులను ఇస్తున్న ప్రభుత్వం..ఈ ఏడాది నగదు ప్రోత్సాహకాలను కూడా భారీగా పెంచింది. జిల్లాలో 8 నియోజకవర్గాల్లో 12123 మంది ప్రతిభా వలంటీర్లకు రివార్డు కింద రూ.18,56,10,000 నగదు అందించనుంది. గత ఏడాది సేవమిత్రలకు అవార్డుతో పాటు రూ.10 వేల నగదును రివార్డుగా అందజేస్తే.. ఇప్పుడు రూ.15 వేలకు పెంచింది. సేవారత్నలకు రూ.20 వేలు ఉంటే..ఇప్పుడు రూ.30 వేలకు పెంచింది. ఇక అత్యున్నతంగా సేవావజ్రలకు గతంలో రూ.30 వేలు ఇవ్వగా..ఇప్పుడు ఆ మొత్తం రూ.45 వేలకు పెరిగింది. అవార్డులకు 12123 మందిని ఎంపిక చేయగా, వీరిలో 'సేవామిత్ర'ల కేటగిరిలో 11912 మందిని ఎంపిక చేసింది. 'సేవారత్న' అవార్డులకు 171 మందిని, అత్యుత్తమ సేవలందించినందుకు 'సేవావజ్ర' పేరిట 40 మంది వలంటీర్లను ఎంపిక చేశారు. సేవారత్న, సేవావజ్రల కింద 211 మందికి నగదు పురస్కారాలతో పాటు మెడల్స్ అందించనున్నారు.

అవార్డులకు ఎంపికైన వలంటీర్లు..

నియోజకవర్గం	సేవామిత్ర	సేవా రత్న	సేవా వజ్ర
ఆమదాలవలస	1277	25	5
ఇచ్ఛాపురం	1595	25	5
నరసన్నపేట	1292	20	5
పలాస	1338	20	5
పాతపట్నం	1494	25	5
శ్రీకాకుళం	2166	21	6
టెక్కలి	1581	20	5
ఎచ్చెర్ల	1169	15	4
మొత్తం	11912	171	40

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన కార్పొరేషన్ చైర్మన్లు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న సూరిబాబు, శ్రీకాంత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను బుధవారం రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు ప్రగతికి పాటుపడాలని, ప్రభుత్వ ఫలాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మందస: బారువ–మందస రైల్వేస్టేషన్ల మధ్య బాలిగాం సమీపంలో బుధవారం గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మరణించినట్లు పలాస జీఆర్పీ పోలీసుల తెలిపారు. మృతుడి వయసు 55–60 ఏళ్ల ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ షేక్‌షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



జీఆర్పీ పోలీసులు విడుదల చేసిన ఫొటో

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్డు) రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్పీ హెచ్‌సీ చక్రధరరావు బుధవారం తెలిపారు. మృతిచెందిన వ్యక్తి వివరాలు లభించకపోవడంతో స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఫొటోలను గుర్తించినట్లు పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ లిఫ్టు వద్ద వ్యక్తి ఫొటో లభ్యమైందని, వివరాలు తెలిసిన వారు 9618017943 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

కేఎఫ్‌సీలో అగ్నిప్రమాదం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని రామలక్ష్మణ కూడలి సమీపంలో గ్రాండ్ హోటల్ మొదటి అంతస్తులో ఉన్న కేఎఫ్‌సీలో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. జిల్లా అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్‌వో వరప్రసాద్‌రావు చెప్పిన వివరాల మేరకు..కేఎఫ్‌సీలో ఉండే చిమ్నీల్లో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరగడంతో ఈ ప్రమాదం సంభవించింది. రెండు ఏసీలు, ఓవెన్లు, ఫ్రిడ్జ్, కంప్యూటర్ కాలిపోయాయని, రూ.5 లక్షల మేర ఆస్తినష్టం జరిగింది. విషయం తెలిసిన వెంటనే బృంది దుర్గారెడ్డి, చిన్నంనాయుడు, జగన్నాథం, పాపారావులు అగ్నిమాపక శకటంతో వెళ్లి మంటలను అదుపుచేశారు.

వడ్రంగి షాపు దగ్ధం



కాలిపోతున్న షాపు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి ప్రధాన రహదారిలో వెంటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న తరణి సురేష్, తరణి రమేష్ కార్పెంటర్, వెల్డింగ్ షాపు అగ్నికి ఆహుతైంది. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో రూ.2లక్షల విలువైన మిషన్లు, రూ.3 లక్షల విలువైన కలప, వస్తువులు కాలిబూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం సంభవించినట్లు బాధితులు చెబుతున్నారు. పొందూరు అగ్నిమాపకం సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బాధితులను ఓదార్చారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల హర్షం



ఏపీసీ జయప్రకాష్‌ను సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిబ్బందికి 11వ పీఆర్‌సీని వర్తింపచేస్తూ 23 శాతం వేతనాల పెంపు అమల్లోకి రావడం పట్ల సమగ్ర శిక్ష ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న ఆర్ట్, వర్క్, వ్యాయామ ఉపాధ్యాయుల యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గౌరవ అధ్యక్షులు వై.సత్యనారాయణ, ఎల్.దిలీప్, జి.కామేశ్వరరావు, పి.తారకేశ్వరరావుల నేతృత్వంలో ఉద్యోగులు బుధవారం సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో ఏపీసీ డాక్టర్ జయప్రకాష్‌ను కలిసి సత్కరించారు.

ఆధునిక సేద్యం లాభదాయకం



కేవీకేలో క్షేత్రస్థాయి ప్రదర్శన తిలకిస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస రూరల్: ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేస్తే లాభసాటిగా ఉంటుందని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ ఉప సంచాలకుడు డాక్టర్ ముకుందరావు అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో 42వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి శాస్త్రవేత్తలు చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేలా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. సేంద్రీయ పద్ధతులు పాటించేలా ప్రోత్సహించాలన్నారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంతీయ సంచాలకులు పీవీకే జగన్నాథరావు మాట్లాడుతూ చెరుకు పంట విస్తీర్ణం పెరిగేలా కృషి చేయాలన్నారు. మార్కెట్‌లో బెల్లం ఉత్పత్తులకు గిరాకీ పెరిగిందని చెప్పారు. అనంతరం ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రీధర్, ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త భగవాన్, వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి పి.వి.సత్యనారాయణ, బి.అప్పలస్వామి, ఆత్మ పీడీ రామచంద్రరావు, కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా!



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్. చిత్రంలో మెంటాడ స్వరూప్ తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అసహనంతో, మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని, నీ వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చిరంజీవి తమ్మినేని చిరంజీవినాగ్ సవాల్ విసిరారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆమదాలవలసలో శంఖారావం సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై కేసులున్నాయని జైలు కెళ్లారని కూన రవి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జైలుకెళ్లిన చంద్రబాబు ఆరోగ్యం బాగాలేదని అబద్ధాలు చెప్పి బయటకువచ్చాడని, జగనన్న మాత్రం కడిగిన ముత్యంలా వచ్చారని గుర్తు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల తరువాత టీడీపీ రాజకీయాల నుంచి శాశ్వతంగా ప్యాకప్ చెప్పడం ఖాయమన్నారు. గూగుల్‌లో ఇసుకాసుర అని టైప్ చేస్తే కూన రవికుమార్‌ను చూపిస్తుందని విమర్శించారు. శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డు ఎన్నికల ముందే పూర్తిచేస్తామన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయంతోపాటు సీతారాం గెలుపు నల్లేరుపైనడకేనన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్ పాల్గొన్నారు.

ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు



ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికైన ఆర్‌ఎస్‌రావును సత్కరిస్తున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్: డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేసి గమ్యస్థానాలకు చేరుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధరరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో డీఎం ఎ.మల్లికార్జునరాజు అధ్యక్షతన రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ అవతారం, చీఫ్ మెడికల్ అధికారి కింతలి కిరణ్‌కుమార్, ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు మల్లిఖార్జునరాజు, కేఆర్‌ఎస్ శర్మలు మాట్లాడుతూ రహదారి నిబంధనలు వివరించారు.ప్రమాద రహిత రికార్డు కలిగిన ముగ్గురు డ్రైవర్లకు బహుమతులు, నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు రాజు, పి.కృష్ణవేణి, వి.రమేష్, ఎ.గంగరాజు, నాలుగు డిపోల డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, అన్ని అసోసియేషన్‌ల ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పలాసలో మాయం.. రాజస్థాన్‌లో ప్రత్యక్షం

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కిష్టుపురంలో మాయమైన ద్విచక్ర వాహనం రాజస్థాన్‌లో ప్రత్యక్షమైన ఘటన చోటుచేసుకుంది. గతేడాది ఏప్రిల్‌లో కిష్టుపురం గ్రామంలో ఆర్.భానుమూర్తి ఇంటి బయట యూనికార్న్ బైక్‌ను పార్కింగ్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో అపహరించుకుపోయారు. ఉదయం బైక్ కనిపించకపోవడంతో బాధితుడు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పది నెలల అనంతరం బైక్ రాజస్థాన్‌లో ఉందంటూ అక్కడి పోలీసుల నుంచి బాధితుడికి బుధవారం ఫోన్ వచ్చింది. స్థానిక పోలీసుల సాయంతో బైక్ తెచ్చుకునేందుకు రాజస్థాన్ వెళ్లనున్నట్లు భానుమూర్తి తెలిపారు.

ఫోన్ చేసి వేధిస్తున్నాడని యువతి ఫిర్యాదు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం పంచాయతీ పాతూరు గ్రామానికి చెందిన మహాశింగి జయరాం తనకు ఫోన్ చేసి వేధిస్తున్నాడని చిన్నకిట్టాలపాడుకు చెందిన యువతి సారవకోట పోలీసుస్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేసింది. తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే చంపుతానని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు.

హస్తకళలకు ప్రాధాన్యం



హార్మోనియం తయారీదారులతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఎచ్చెర్ల క్యాంపస్: హస్త కళలకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఏపీ హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి అన్నారు. చిలకపాలెంలో హార్మోనియం పెట్టెలు తయారు చేస్తున్న నదెళ్ల రమణాచారి, అప్పలసూరిలను బుధవారం సన్మానం చేశారు. హార్మోనియం పెట్టెల అమ్మకాలు, ఆదాయం, జీవనాధారం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసక్తితో వృత్తిని కొనసాగిస్తున్నామని చెప్పారు. కళాకారులకు కార్డులు అందజేయాలని, వృద్ధ కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

జగనన్న కాలనీలో గృహ ప్రవేశ సందడి



సీఎం చిత్రపటంతో గృహప్రవేశం చేసిన యజమాని దెరీషా, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండల కేంద్రంలోని ప్రహరాజపాలేం జగనన్న లేఅవుట్-1, జగనన్న కాలనీలో గృహ ప్రవేశ సందడి నెలకొంది. పిల్లివీధికి చెందిన దెరీషాతో కలిసి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం జగనన్న కాలనీ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇంటిస్థలంతో పాటు రూ.1.80లక్షల ఆర్థిక సాయం, డ్వాక్రా మహిళలకు రూ.35 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు అందిస్తుందని చెప్పారు. తాజాగా రిజిస్ట్రేషన్ కూడా చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గురాడ అప్పన్న, పనుకు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీర వసంతేశ్వర విగ్రహ ప్రతిష్టాపన

- రూ.2.50 కోట్లతో అయ్యప్ప, ఆంజనేయ, నవగ్రహ మంటపాల నిర్మాణం
- దర్శించుకున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: మండలంలోని శ్వేతగిరిపై నూతనంగా నిర్మించిన వీరవసంతేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. రూ. 2.50 కోట్లతో అయ్యప్ప, ఆంజనేయ, నవగ్రహ మంటపాలు సముదాయంలో వేదపండితులు సుసరాపు చంద్రశేఖర శర్మ, అర్చకులుచే ఈ క్రతువు నిర్వహించారు. ముందుగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మహేంద్రాడ రవికుమార్‌శర్మ దంపతులు ఆభరణాలు, యంత్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం హైద్రాబాద్‌కు చెందిన యోగేశ్వరశర్మచే అయ్యప్ప పడిపూజ, భజన నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురాం, గుండ భాస్కరరావు, పీస గోపి, యాళ్ల నారాయణమూర్తి, జల్లు గౌరిపతినాయుడు, కొయ్యాన నాగభూషణం, కొంక్యాణ ఆదినారాయణ, జల్లు రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

గైనికాలజిస్టుల సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గమిదే

శ్రీకాకుళం : జిల్లా గైనికాలజిస్టుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైనట్లు డాక్టర్ ఎస్.శ్రీదేవి, డాక్టర్ ఎం.సందీప్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జిల్లా ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణుల సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షునిగా డాక్టర్ పూబ రామారావు, గౌరవ అధ్యక్షులుగా దానేటి శ్రీధర్, కార్యదర్శిగా డాక్టర్ బగ్గు సంధ్య, ఉపాధ్యక్షులుగా డాక్టర్లు డి.పార్వతి, పి.రేవతి, ఎస్.శ్రీదేవి, కోశాధికారిగా ప్రశాంతి, సహాయ కార్యదర్శులుగా డాక్టర్లు సందీప్, ప్రవంతి, స్వర్ణలత, ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా ఆర్.అరవింద్, ఆరుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సంఘం జాతీయస్థాయి ఫెడరేషన్‌కు అనుసంధానించినట్లు తెలిపారు.

డ్రైవర్లదే ప్రయాణికుల భద్రత



ఆటోవాలాలతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టేలా బాధ్యతగా వాహనాలను నడుపుతూ సురక్షితంగా గమ్యస్థానాల్లో చేర్చాలని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆటోడ్రైవర్లకు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ట్రాఫిక్ పోలీసులు, జిల్లా రవాణా అధికారుల ఆధ్వర్యంలో ఆటోవాలాలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ హైవేల్లో సర్వీసు రోడ్లో మాత్రమే ఆటోలు నడపాలని స్పష్టం చేశారు. ప్రమాదం చేసిన వెంటనే మీరు తప్పించుకున్నారనుకున్నా సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉంటారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ మోహన్, నెహ్రూ యువకేంద్రం ఉజ్వల్‌లు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించగా కె.సి.ఐకేర్ వైద్యుడు పి.ఎల్.రాజు ఆటోడ్రైవర్లకు కంటివైద్య చికిత్సలు చేశారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గంగాధర్, అనిల్‌ల ఆధ్వర్యంలో లైవ్ యాక్సిడెంట్ వీడియోలు ప్రదర్శించి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ యర్రగుంట శృతి, ట్రాఫిక్ సీఐ అవతారం, రూరల్ సీఐ సన్యాసినాయుడు, ట్రాఫిక్ సిబ్బంది, ఎస్జీవోలు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన తప్పనిసరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అభ్యర్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి భారత ఎన్నికల సంఘం ముద్రించిన ప్రత్యేక హ్యాండ్ బుక్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, రొౌతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పి.ఎం.జే.బాబు (టీడీపీ), దేసెళ్ల మల్లిబాబు (కాంగ్రెస్), సురేష్‌బాబుసింగ్ (బీజేపీ), డి.గోవిందరావు (సిపిఎం) తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్య చిరస్మరణీయుడు



సంజీవయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారుల, ప్రజా సంఘాల నేతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంబేడ్కర్ స్ఫూర్తితో ఎదిగిన మహానేత , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదర సంజీవయ్య నేటి యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ విశ్వమోహన రెడ్డి, జిల్లా ఖజానా అధికారి రవికుమార్ అన్నారు. బుధవారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాలకొండ రోడ్డులోని సంజీవయ్య పార్కులో సంజీవయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఖజానా శాఖ డీడీ రవికుమార్, దామోదర సంజీవయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ కంఠ వేణు, దళిత నాయకులు బోసు మన్మథ రావు, పెయ్యల చంటి, పురుషోత్తం రాంబాబు, చీర రాజేశ్వరి, సంతు, పంకు మురళి, అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్' చేసేందుకు సిద్ధం

- నేడు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు
- టెక్కలి ఐతమ్ కళాశాల వేదికగా నిర్వహణ
- ఉత్తమ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక



ప్రదర్శనలకు సిద్ధం చేసుకున్న ప్రాజెక్టులతో విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్యాశాఖ నడుంబిగించింది. 'ఇన్‌స్పైర్ మనక్' పేరిట సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు రంగం సిద్ధమైంది. టెక్కలిలోని ఆదిత్య ఇంజినీరింగ్ (ఐతమ్) కళాశాల వేదికగా జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం ఉదయం 9 గంటలకు మొదలయ్యే ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు, విద్యాశాఖ సిబ్బంది హాజరుకానున్నారు.

జిల్లా నుంచి 164 ప్రాజెక్టులు ఎంపిక..

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలను ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టుల పురస్కారాలతో ప్రోత్సహిస్తున్నాయి.



ఇటీవల నిర్వహించిన ప్రదర్శనల్లో ప్రాజెక్టును నిశితంగా పరిశీలిస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు

2022–23 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు వారి ఆలోచనలకు పదును పెట్టి ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేశారు. ఈ విధంగా 2022–23కుగాను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి 1950 ప్రాజెక్టుల నామినేషన్లు పంపించారు. ఇందులో విషయ పరిజ్ఞానం, సరికొత్త ఆలోచనలతో రూపుదిద్దుకున్న 216 ప్రాజెక్టులను అధికారులు ఎంపికచేశారు. ఇందులో 30 మండలాల(రాజాం, పాలకొండ నియోజకవర్గాల మినహా)తో కూడిన శ్రీకాకుళం జిల్లా నుంచి 164 ప్రాజెక్టులను జిల్లాస్థాయి పోటీలకు అనుమతిస్తున్నారు. ప్రాజెక్టు తయారీ, నిర్వహణ, ప్రదర్శనల కోసం వచ్చేందుకు ప్రాజెక్టుకు రూ.10వేలు చొప్పున ప్రోత్సాహాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో ఇప్పటికే ప్రభుత్వం జమచేసింది.

10 శాతం రాష్ట్రపోటీలకు ఎంపిక..

164 ప్రాజెక్టులలో ఉత్తమమైనవి 10 శాతం అనగా 16 ప్రాజెక్టులు రాష్ట్రపోటీలకు ఎంపికచేస్తారు. మరికొన్ని మెరుగైన ప్రాజెక్టులు సైతం రాష్ట్రపోటీలకు ఎంపిక చేసే వెసులుబాటు ఉంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో తదుపరి రాష్ట్రపోటీలు చిత్తూరు వేదికగా (తేదీలు ఖరారుకాలేదు) జరగనున్నాయి.

అన్ని ఏర్పాట్లు పూర్తి..



ఇన్‌స్పైర్ మనాక్ జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్‌కు 30 మండలాల జిల్లా నుంచి 164 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఐతమ్ కళాశాలలో ప్రాజెక్టుల ప్రదర్శనలకు ఏర్పాట్లు చేశాం. ప్రాజెక్టులతోపాటు విద్యార్థులను క్షేమంగా తీసుకువచ్చేందుకు గైడ్ టీచర్లు కృషి చేయాలి. – ఎస్.కుమారస్వామి, జిల్లా సైన్స్ అధికారి, కార్యక్రమ కోఆర్డినేటర్

విధిగా ప్రదర్శనకు రావాలి..



విద్యార్థుల్లో ఆలోచన సరళి, పరిశోధనా ధోరణి పెరిగింది. ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ఎంపికైన ప్రతి ప్రాజెక్టునూ ఎగ్జిబిషన్‌కు విధిగా తీసుకురావాలి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించేందుకు పోటీలు ఉపకరిస్తాయి. – కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం